క్లుప్తంగా

సేవలు గుర్తుండిపోతాయి

మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి

మోమిన్‌పేట: నిస్వార్థంగా చేసే సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం రాజు ఇటీవల బదిలీపై పరిగికి వెళ్లారు. మర్పల్లిలో విధులు నిర్వహిస్తున్న పీఎం మధుకర్ మోమిన్‌పేటకు వచ్చారు. దీంతో ఒకరికి వీడ్కోలు, ఇంకొకరికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారికి శాలువా కప్పి సన్మానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏపీఎం విధులు పూర్తిగా మహిళల మధ్యనే చేయాల్సి ఉంటుందన్నారు. కావున ఎంతో నేర్పరితో ప్రతీ ఒక్కరికి సమాధానం చెప్పాల్సి ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఎన్నో సమస్యలతో వచ్చే మహిళలకు విధినిర్వహణలో ఓపికతో మసలుకుని సమాధానాలు చెప్పేవారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

దౌల్తాబాద్: మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నర్సిములు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో మండల అధ్యక్షుడు అశోక్ ఆధ్వర్యంలో తహసీల్దారు గాయత్రికి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని 24గంటలకు పెంచాలని, రోడ్లను బాగు చేయాలని, ఫాగింగ్ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీశ్, రాజశేఖర్, అంజన్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీఆర్టీయూ సంఘం నాయకులు

దౌల్తాబాద్: సెప్టెంబర్ 1వ తేదీని పెన్షన్ విద్రోహ దినంగా నిర్వహిస్తున్న క్రమంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాను విజయవతం చేయాలని మండల పీఆర్టీయూ సంఘం అధ్యక్షుడు భీమప్ప అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకట్ స్వామి, సంఘం నాయకులు సాయిలు, సుభాష్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షీటీంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అనంతగిరి: కొత్తగడిలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం షీటీంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డయల్ 100, 181, 1098 ప్రాధాన్యతను వివరించారు. దాంతో పాటు సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబర్, 1930 గురించి చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూల్ జీహెచ్‌ఎం వీరకాంతం, షీటీం సిబ్బంది బుచేందర్‌రెడ్డి, రేష్మా, కళాజాత ఇన్‌చార్జి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పదవులపై ఉన్న శ్రద్ధ సమస్యలపై లేదు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్‌కుమార్

తాండూరు రూరల్: కాంగ్రెస్ నాయకులకు పదవుల మీద ఉన్న శ్రద్ధ సమస్యల పరిష్కారంపై లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్‌కుమార్ విమర్శించారు. మంగళవారం పెద్దేముల్ మండల కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వివిధ గ్రామాల్లోని రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయన్నారు. ఈ విషయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్న కాంగ్రెస్ నాయకులకు పట్టడం లేదన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతారన్నారు. రోజు రోజుకు బీజేపీ బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పెద్దేముల్ తండా యూత్ సభ్యులు అన్నారు. మంగళవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా బూట్లు, టై, బెల్టు, నోట్ బుక్కులను పంపిణీ చేశారు.

పండుగ వేళ.. మెండుగా ఉపాధి

- వినాయక చవితికి చేతి నిండా పని
- చిరు వ్యాపారులకు ఆదాయం
- నేటి నుంచి నవరాత్రోత్సవాలు



విగ్రహాలకు రంగులు వేస్తున్న కళాకారుడు

దుద్యాల్: వినాయక చవితి సందర్భంగా వాడవాడల్లో విగ్రహాలను ప్రతిష్టించి పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా నవరాత్రోత్సవాల సంబరాలు అంబరానంటుతాయి. వివిధ వృత్తుల వారికి, చిరు వ్యాపారులకు సైతం నిండుగా ఉపాధి లభిస్తుంది. ఈ క్రమంలో దసరా, దీపావళి, ఉగాది పండగలకు దుస్తువులు, టపాసులు, నిత్యవసర సరుకుల వంటి వ్యాపారాలు జోరుగా సాగుతుంటాయి. ఇందులో భాగంగా వినాయక చవితి ప్రత్యేకం. చిరువ్యాపారులకు, వివిధ రంగాల కార్మికులు, రైతులకు ఆదాయాన్ని తెచ్చి పెడుతుంది. పురోహితులకు, సౌండ్ సిస్టమ్, లైటింగ్, పండ్లు, పూలు ఇలా పలు చిన్న, చిన్న వ్యాపారులకు కడుపు నింపే పండుగా అని చెప్పొచ్చు. దీని కోసం ప్రారంభం నుంచే చాలా మందికి ఉపాధి దొరుకుతుంది. అందుకే ఈ ఉత్సవాలపై అనేక మంది ఆశలు పెట్టుకుంటారు. పల్లె, పట్టణం తేడా లేకుడా అన్ని ప్రాంతాల్లో చవితి వేడుకలు నిర్వహిస్తారు. కాబట్టి కొన్ని రోజుల నుంచి వినాయక మండపాల తయారీలో నిర్వాహకులు బీజీగా మారుతారు. దాదాపు 11 రోజుల పాటు కొనసాగనున్న ఈ ఉత్సవాలకు కార్మికులకు ఉపాధి దొరకనుంది.

చిరు వ్యాపారులు, రైతులకు సైతం..

కొన్ని రోజులు ఇబ్బందులు లేకుండా చిరువ్యాపారులు, రైతుల కడుపు నింపేందుకు ఈ పండుగ ఎంతగానో దోహదపడుతుంది. వేడుకలు జరిగినన్ని రోజులు పూలు, పండ్లు, కూరగాయల వ్యాపారం జోరుగా ఉంటుంది. వారికి ఎంతో కొంత ఆదాయం సమకూరనుంది. ఈ సందర్భంగా కుటుంబ పోషణకు ఇబ్బంది ఉండదు.

కార్మికుల జీవనం సాఫీగా...

అసంఘటిత కార్మికులకు ఉపాధి లభిస్తుంది. ముఖ్యంగా ఎలక్ట్రీషియన్, దినసరి కూలీలు, ట్రాక్టర్, లారీ డ్రైవర్లకు చేతినిండా పని దొరుకుతుంది. నవరాత్రుల సందర్భంగా అసంఘటిత రంగ కార్మికులకు ఉపాధి మెండని చెప్పొచ్చు.

పురోహితులకు..



పురోహితులకు ఏడాదిలో చాలా వరకు పని ఉండదు. కానీ ఈ పండుగ వచ్చిదంటే చాలు కొన్ని రోజుల పాటు పురోహితులందరికీ పని దొరుకుతుంది. నిత్యం ఒకటి కంటే ఎక్కువ పూజలు నిర్వహించే అవకాశం లభిస్తుంది. ఒకటి కంటే ఎక్కువ ఉపాధి లభించే పండుగా ఇదే. మాతో పాటు ఇతర రంగాల వారికి కూడా పనులు లభిస్తాయి.

– ప్రేమ్ శంకర్, పురోహితుడు, హస్నాబాద్

ఆరోపణలు అవాస్తవం

- పేదలను గుర్తించి మంజూరు చేశాం
- హస్నాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీములు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

దుద్యాల్: హస్నాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలు జరిగాయని బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని కాంగ్రెస్ అధ్యక్షుడు తూర్పు భీములు, లబ్ధిదారులు పేర్కొన్నారు. మంగళవారం గ్రామంలోని గాంధీ చౌరస్తా వద్ద చావుడిలో సమావేశం ఏర్పాటు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జెడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు ముదిగిండ్ల కృష్ణ సోమవారం ఓ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇళ్ల లబ్ధిదారుల నుంచి కాంగ్రెస్ నాయకులు వసూళ్లకు పాల్పడ్డారని నిందలు మోపడం బాధాకరమన్నారు. అంతేకాక బీఆర్ఎస్ నాయకులకు ఒక్క ఇళ్లు కూడా మంజూరు చేయలేదనడం విడ్డురంగా ఉందన్నారు. గ్రామంలో పార్టీలకతీతంగా ఇళ్ల మంజూరు చేశామన్నారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ ఒక్క ఇళ్లకూడా మంజూరు చేయలేదని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో లబ్ధి పొందాలనే కాంగ్రెస్‌పై బురద జల్లుతున్నారన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు తాజున్నిసా బేగం, జులేక బేగం, అంజమ్మ, మల్లమ్మ, పద్మమ్మ, రేణుక, పార్టీ నాయకులు రాములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి



పాఠశాలకు ప్రింటర్ ఇస్తున్న ఫీల్డ్ ఆఫీసర్ సచిన్

ఎస్ఎంసీ మాజీ చైర్మన్ శివరాజ్

బంట్వారం: పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని బస్వాపూర్ పాఠశాల ఎస్ఎంసీ మాజీ చైర్మన్ మంగలి శివరాజ్ పేర్కొన్నారు. తొర్మామిడి యూనియన్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సచిన్ మంగళవారం పాఠశాలకు ప్రింటర్ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శివరాజ్ మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. పాఠశాలకు తన సహకారం ఎల్లవేళల ఉంటుందని తెలిపారు. ప్రతీ రోజు దిన పత్రికలు, పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు సచిన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ శాకం నర్సింలు, మాజీ సర్పంచ్ తలారి నర్సింలు, సొసైటీ మాజీ వైస్ చైర్మన్ బల్వంత్‌రెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, హన్మయ్య, లక్ష్మయ్య, బిచ్చయ్య, రాజు, వెంకటయ్య, రాజప్ప, అంజి, గోపాల్ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి నిరంతర కృషి



నూతన గ్రామ కమిటీని సన్మానిస్తున్న నాయకులు

- డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్
- నూతన గ్రామ కమిటీ ఎంపిక

కుల్కచర్ల: పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. మంగళవారం రాంనగర్ గ్రామ పంచాయతీలో నూతన గ్రామ కాంగ్రెస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ అని అన్నారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఉచిత విద్యుత్ పథకం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వంటివి కల్పిస్తునారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాంనగర్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా గొల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కిష్టు నాయక్, ఉపాధ్యక్షుడిగా హీర్యనాయక్, యూత్ అధ్యక్షుడిగా వి.గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శంకర్, బీసీ సెల్ అధ్యక్షుడిగా కృష్ణప్రసాద్, ఎస్టీ సెల్ శ్రీనునాయక్ తదితరులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భరత్ కుమార్ రెడ్డి, ఐలగారి కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న కొమ్మల నరికివేత

అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తం చేస్తున్న స్థానికులు



బాస్‌పల్లి, బొంపల్లి సమీపంలో కొమ్మలను నరికివేసిన విద్యుత్ అధికారులు

దోమ: ప్రభుత్వం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా రోడ్లకు ఇరువైపుల మొక్కలు నాటాలని సూచిస్తుంటే, మరో పక్క పెరిగిన చెట్ల కొమ్మలను నరికివేయిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం దోమ మండల పరిధిలోని బాస్‌పల్లి, బొంపల్లి గ్రామాల సమీపంలో విద్యుత్ అధికారులు హరితహారంలో పెరిగిన చెట్ల కొమ్మలను సగభాగంలో నరికివేశారు. మోత్కూర్ సబ్‌స్టేషన్ నుంచి బొంపల్లి గ్రామ సమీపంలోని ఓ రైస్ మిల్‌కు ఇటీవలే 11 కేవీ లైన్‌ను కేటాయించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇచ్చారు. గతంలో అక్కడ హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. అవి పెరిగి పెద్దగయ్యాయి. రైస్ మిల్‌కు కేటాయించిన 11 కేవీ లైన్‌కు చెట్లకొమ్మలు అడ్డుగా వస్తున్నాయని సగభాగంలో నరికివేశారు. దీంతో స్థానికులు అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు.

పనికి తగిన వేతనం చెల్లించాలి

పరిశ్రమ ఎదుట కార్మికుల ఆందోళన

నందిగామ: పనికి తగిన వేతనం చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన నందిగామలోని పిత్తిల్యామినేషన్ పరిశ్రమలో గత కొంతకాలంగా వెల్డింగ్ పనులు చేస్తున్న కార్మికులకు పరిశ్రమ యాజమాన్యం పనికి తగిన వేతనం చెల్లించడం లేదని ఆరోపిస్తూ మంగళవారం పరిశ్రమ ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొంత కాలంగా వెల్డింగ్ పనులు చేస్తున్న తమకు తగిన వేతనాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. పనికి తగిన వేతనాలు చెల్లించే వరకు విధుల్లోకి చేరబోమని డిమాండ్ చేశారు. పలువురు కార్మిక సంఘాల నాయకులు పర్వతాలు, అశోక్, సాయిబాబు కార్మికులకు మద్దతు పలికారు. ఘటన స్థలానికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కార్మికులతో మాట్లాడారు. యాజమాన్యంతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పడంతో కార్మికులు ఆందోళన విరమించారు.

పేదలకే ఇందిరమ్మ ఇళ్లు



ప్రొసీడింగ్ అందజేస్తున్న నాయకులు

కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తమ్‌చంద్

తాండూరు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తమ్‌చంద్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని జినుగుర్తి గ్రామంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. తాండూరు మండలంలో 859 మంజూరు చేశారని గుర్తు చేశారు. బేస్‌మెంట్ బిల్లులు వచ్చాయి: ఎంపీడీఓ విశ్వప్రసాద్.. 33 గ్రామ పంచాయతీల్లో ఇప్పటి వరకు 180 మంది లబ్ధిదారులకు బేస్‌మెంట్ బిల్లులు వచ్చాయని ఎంపీడీఓ విశ్వప్రసాద్ అన్నారు. మండలంలో మొత్తం 859 ఇందిరమ్మ ఇళ్లల్లో ఇప్పటి వరకు 631 ప్రొగ్రెస్‌లో ఉన్నాయన్నారు. 228 ఇళ్లు ఇప్పటి వరకు ప్రారంభించలేదన్నారు. కావున వెంటనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని లబ్ధిదారులకు సూచించారు. అల్లాపూర్, జినుగుర్తి గ్రామాల్లో పనులు నత్తనడకన జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాములు, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్యామప్ప, అజ్మత్‌అలీ, నర్సిములు, రాములు తదితరులు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఉత్తమ్‌చంద్

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

అనంతగిరి: ప్రభుత్వం అర్హులందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను అందిస్తుందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని వెంకటపూర్ తండాకు చెందిన 29మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని, సంక్షేమానికే అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, బ్లాక్ అధ్యక్షుడు అనంత్ రెడ్డి నాయకులు పరశురాంనాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డీజేలకు అనుమతులు లేవు



పరిగి: మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్



మోమిన్‌పేట: మాట్లాడుతున్న వెంకట్

పీస్ కమిటీ సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్

పరిగి: వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని, పర్యావరణాన్ని కాపాడేందుకు మట్టి విగ్రహాలను ప్రతిష్టించేల చర్యలు తీసుకోవాలని పరిగి డీఎస్పీ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం పట్టణ కేంద్రంలో మండపాల కమిటీ సభ్యులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి వినాయకులను ప్రతిష్టించి పూజించుకోవాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్‌ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల కాలుష్యం పెరుగుతుందన్నారు. మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో తప్పకుండా అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరి, డీటీ అనిల్‌బాబు, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, ఎస్‌ఐ మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట: డీజేలకు అనుమతులు లేవని సీఐ వెంకట్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రాయల్ ఫంక్షన్ హాల్లో మంగళవారం శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి డీజేలు ఉపయోగిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. మండపాల ఏర్పాటుకు అనుమతుల కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. మండపాల ఏర్పాటులో నిర్వాహకులు పూర్తి బాధ్యత తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండ ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ అరవింద్, ఆర్‌ఐ సరిత, కార్యదర్శి స్వప్న, నాయకులు అశిరెడ్డి, సుభాష్‌గౌడ్, అనూప్‌రెడ్డి, చంద్రయ్య, సుభాశ్, ఎజాస్, ఏరాజ్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాతంగా జరుపుకోవాలి

దోమ: వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తహసీల్దార్ గోవిందమ్మ అన్నారు. దోమ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ వసంత్ జాదవ్ నిర్వహించిన శాంతి సమావేశంలో ఆమె మాట్లాడారు. కులమతాలకు అతీతంగా పండుగలు నిర్వహించుకోవాలన్నారు. అనంతరం ఎస్‌ఐ వసంత్ జాదవ్ మాట్లాడుతూ..వినాయక మండప నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని అనుమతులు తీసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా డీజేలు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మర్పల్లి: గణేష్ నవరాత్రుల ఉత్సవాలను ప్రశాంత వాతావరణలో జరుపుకోవాలని ఎస్‌ఐ అబ్దుల్ రహూఫ్ సూచించారు. మర్పల్లి పీఎస్‌లో గణేష్ మండపాల నిర్వాహకులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పనిసరిగా నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

రిటైర్డ్ ప్రిన్సిపాల్ హన్మంతు

దౌల్తాబాద్: విద్యార్థులు బాగా చదువుకుని కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని రిటైర్డ్ ప్రిన్సిపాల్ హన్మంతు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన కళాశాలలో పదో తరగతి విద్యార్థులు చేరాలన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకట్‌స్వామి, ప్రిన్సిపాల్ వసంత, రిటైర్డ్ ఎంఈఓ బాబుసింగ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

యూరియా సరఫరాలో విఫలం

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి



డీటీ పరశురామ్‌కు వినతి పత్రం అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

మర్పల్లి: యూరియా సరఫరా చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, కేసీఆర్ పాలనలోనే రైతులు సుభిక్షంగా ఉన్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మధుకర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం రైతులతో కలిసి బీఆర్ఎస్ శ్రేణులు తహసీల్దార్, వ్యవసాయ శాఖ కార్యాలయాలను ముట్టడించి ఆందోళన చేపట్టారు. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతు సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేశారు. అనంతరం డీటీ పరశురామ్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఏఓ కార్యాలయ ముట్టడి అనంతరం సరఫరా విషయం గురించి ఏఓ శ్రీకాంత్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. షరతులు లేకుండా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ ప్రెసిడెంట్ మధుకర్, మాజీ ఎంపీపీ బట్టు లలితరమేష్, మాజీ వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ గఫార్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, అనీల్, మాజీ ఎంపీటీసీ వెంకటేశం, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, నీలి శ్రీకాంత్, రమేశ్‌మిత్ర, జయరాజ్, ఆకాశ్, వికాస్, దీపక్ పార్టీ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

వివక్ష తగదు..

మోమిన్‌పేట: రాష్ట్రానికి సరిపడ ఎరువులు విడుదల చేయడంలో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతుందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ విషయంలో వ్యవసాయ శాఖ కేంద్ర ప్రభుత్వాన్ని ముందస్తుగానే కోరినప్పటికి విడుదల చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని బదనం చేసేందుకే బీజేపీ ప్రభుత్వం కంకణం కట్టుకుందని ఆయన తెలిపారు.